క్లుప్తంగా

నాగేశ్వరరావుకు నివాళులర్పించిన కొఠారు



నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కొఠారు, ఇతర నాయకులు

పెదవేగి : చక్కటి వ్యక్తిత్వంతో అందరినీ ఆప్యాయంగా పలుకరించే వ్యక్తి నాగేశ్వరరావు లేని లోటు ఆయన కుటుంబంతోపాటు పార్టీకి తీరని లోటని ఏపీ ఆయల్ ఫెడ్ రైతు కమిటీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత కొఠారు రామచంద్రరావు అన్నారు. పెదవేగి మండలం రాయన్నపాలెంకి చెందిన విడుదల నాగేశ్వరరావు కొద్ది రోజుల క్రితం మరణించగా, ఆయన సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కొఠారు తదితరులు నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన వెంట పార్టీ నాయకులు, అధికారులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముమ్మరంగా గడపగడపకు హామీల అమలు



జల్లికాకినాడలో సీసీ డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ నాగరాజు

గణపవరం: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే దృష్టికి ప్రజలు తీసుకువచ్చిన సమస్యలను వేగవంతంగా పరిష్కారమవుతున్నాయి. ఎమ్మెల్యే వాసుబాబు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజల వ్యక్తిగత సమస్యలతోపాటు గ్రామంలోని సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో గ్రామాల్లో సమస్యల పరిష్కారం దిశగా అభివృద్ధి పనులు చేపట్టారు. ఆదివారం గణపవరం మండలం జల్లికాకినాడలో సీసీ డ్రెయిన్ నిర్మాణానికి సర్పంచ్ బాత నాగరాజు శంకుస్థాపన చేశారు. పది రోజుల్లో డ్రెయిన్ నిర్మాణం పూర్తి చేస్తామని, ఎంతోకాలంగా ప్రజలు కోరుతున్న కోరిక నేటికి నెరవేరిందని ఆయన అన్నారు.

కలపర్రు చర్చి నిర్మాణానికి ఆర్థిక సాయం



కలపర్రు బైబిల్ మిషన్ సంఘంలో జగదీష్ ప్రతాప్‌బాబును సత్కరిస్తున్న దృశ్యం

పెదపాడు: కలపర్రు గ్రామంలో బైబిల్ మిషన్ నూతన చర్చి నిర్మాణానికి దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సహకారంతో రూ. 40 లక్షల ఆర్థిక సాయం అందజేస్తామని ఏపీ క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ పందు జగదీష్ ప్రతాప్‌బాబు అన్నారు. ఆదివారం కలపర్రు బైబిల్ మిషన్ సంఘం ఆధ్వర్యంలో పందు జగదీష్‌ను మిషన్ పెద్దలు, ఏలూరు జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సభ్యులు గుర్రాల రవికుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఫాస్టర్లు ఇస్రాయేలు, బాలసుబ్రహ్మణ్యం, సకలబత్తుల అనిల్, మనోజ్, నల్లమిల్లి రాజు ఉన్నారు.

ఏబీవీపీ కన్వీనర్‌గా జితేంద్ర

గణపవరం: ఉంగుటూరు నియోజకవర్గ ఏబీవీపీ భాగ్ కన్వీనర్‌గా గణపవరానికి చెందిన కోడూరి జితేంద్రనాథ్ నియమితులయ్యారు. ఈమేరకు ఆదివారం ఏలూరులో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఏలూరు జిల్లా కన్వీనర్ నగుళ్ళ నాగబాబు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. నియోజకవర్గంలోని విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జితేంద్రనాథ్ తెలిపారు. ఉంగుటూరు నియోజకవర్గం శాయంపాలెంకు చెందిన సాయిరాం రెడ్డి ఏలూరు జిల్లా స్టూడెంట్ ఫర్ డవలప్‌మెంట్ కన్వీనర్‌గా నియమితులయ్యారు.

ఎమ్మెల్యే ఆళ్ల నాని సహకారం మరువలేనిది



అంబటి గురుమూర్తి

ఏలూరు (టూటౌన్): తెలికుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల నాని సహకారం మరువలేనిదని అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు అంబటి గురుమూర్తి అన్నారు. స్థానికంగా ఆయన నివాసంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లా కేంద్రమైన ఏలూరులో తమ సంఘ భవనం, కమ్యూనిటీ హాలు నిమిత్తం 500 గజాల స్థలాన్ని కేటాయించడంతో పాటు నిర్మాణానికి రూ.10లక్షలు నిధులు అందించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. తమ జాతి సంక్షేమం, అభివృద్ధికోసం తోడ్పాటు అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆళ్ల నానిలకు జిల్లా అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు.

సర్కారు బడులకు నూతన శోభ



శిథిలావస్థకు చేరిన భీమడోలు-4 పాఠశాల పాత చిత్రం



భీమడోలు-4 పాఠశాల చుట్టూ నిర్మించిన ప్రహరీ

నాడు – నేడు పథకంలో మారిన రూపురేఖలు
భవనాల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన

భీమడోలు: నాడు– నేడు పథకం సర్కారు బడుల పాలిట వరంగా మారింది. శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధం ఉన్న ప్రభుత్వ బడులు నేడు కార్పొరేట్ స్థాయి సౌకర్యాలతో నూతన శోభను సంతరించుకుని ఆకర్షణీయంగా మారాయి. బాలబాలికల బోధనకు అవసరమైన సాంకేతిక సదుపాయాలు, పాఠశాలల్లోని మరుగుదొడ్లు, మంచినీటి సదుపాయం, ఇతర వసతులను కల్పించారు. లక్షలాది రూపాయలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దబడిన పాఠశాలలు బాలబాలికలతో పాటు తల్లిదండ్రులను ఆకట్టుకుంటున్నాయి. మండలంలో రెండో విడత నాడు– నేడు పథకంలో 21 పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు రూ.2.28 కోట్ల మంజూరు కాగా చురుగ్గా పనులు సాగుతున్నాయి.



నాడు- నేడు పథకంలో నూతనంగా నిర్మించిన పాఠశాల భవనం

భీమడోలు- 4 ప్రాథమిక పాఠశాల దళిత వాడలో ఉంది. ఏన్నో ఏళ్లుగా శిథిలావస్థలో ఉన్న ఈ భవనం చుట్టూ ప్రహరీ లేకపోవడంతో రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారేది. ఏన్నో ఏళ్ల సంబంధిత అధికారులు, పాలకులకు స్థానికులు విన్నవించినా పట్టించుకున్న నాథుడు కరువయ్యారు. ఈ తరుణంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి ఇతోధికంగా నిధులు వెచ్చిస్తూ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు నాడు- నేడు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పాఠశాలను అభివృద్ధి చేసేందుకు రూ.29లక్షల నిధులను మంజూరు చేసింది. దీనితో నాడు- నేడు నోడల్ టీచర్ ఎం.శరీన్ ఆధ్వర్యంలో కొత్త భవనాన్ని నిర్మించారు. మరో భవనానికి పూర్తిస్థాయి మరమ్మతులు చేసారు. ఇప్పటికే పాఠశాలకు రంగుల వేసారు. డెస్కులు, టైల్స్ తదితర వసతులను సమకూర్చారు. మండలంలోని అన్ని పాఠశాలలు నాడు – నేడు పథకంలో అభివృద్ధి చేశారు.

నేడు సీతంపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

దెందులూరు: సీతంపేటలో సోమవారం సర్పంచ్ పరసా లక్ష్మిసుజాత అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఏలూరు ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి, వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని తెలిపారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఈ కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు. గ్రామ శివారు ప్రాంతాల్లో ప్రజలు ఈ శిబిరంలో ఉచితంగా అందించే వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని పొంది మందులు తీసుకోవాలని కోరారు.

నేడు జగన్నాథపురంలో

పెదవేగి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జగన్నాథపురంలో సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ తాతా రమ్య తెలిపారు. గ్రామంలో కొన్ని రోజులుగా వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి, వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి టోకెన్‌లు అందించారని తెలిపారు. వారందరూ ప్రత్యేక వైద్య శిబిరంలో పాల్గొని వైద్య సలహాలు, ఉచితంగా మందులు పొందవచ్చని ఎంపీపీ తెలిపారు.

రైతుల సమస్యలపై 12న సదస్సు

దెందులూరు: ధాన్యం క్వింటాల్‌కు 500 బోనస్ ప్రకటించి ధాన్యం కొనుగోలు సమస్యలు పరిష్కరించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధర, సాధారణ రకానికి క్వింటాల్‌కు రూ.2183, ఏ-గ్రేడ్ క్వింటాకు రూ.2203 ప్రకటించిందని ఈ ధర రైతుకు గిట్టుబాటు కాదన్నారు. ఆదివారం పోతునూరు, ఉండ్రాజవరం రైతుల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 12న ఏలూరులో రైతు సమస్యలపై నిర్వహించనున్న జిల్లాస్థాయి రైతు సదస్సు విజయవంతం చేయాలని కోరారు.

పీఎంపీలు ప్రజలకు మెరుగైన సేవలందించాలి

భీమడోలు: పీఎంపీలు సేవాదృక్పథంలో పని చేసి రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని పలువురు వక్తలు అన్నారు. భీమడోలులో ఆదివారం పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమడోలు, ద్వారకాతిరుమల, నల్లజర్ల మండలాల పీఎంపీ సభ్యులు, రాష్ట్ర, జిల్లా ప్రతినిధులుకు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల అధ్యక్షుడు కొత్తపల్లి చంద్రమౌళి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఎముకల వైద్య నిపుణుడు బి.కృష్ణ, నరాలు, మానసిక ఆరోగ్య నిపుణులు వంశీకృష్ణ, పీఎంపీలకు పలు వైద్య సలహాలను అందించారు. వారి అనుమానాలను నివృత్తి చేసారు. రోడ్డు ప్రమాద క్షతగాత్రులను ఆసుపత్రుల్లో చేర్పించేందుకు మండలానికి ఒక అంబులెన్స్‌ను కేటాయిస్తున్నామని, ఉచితంగా సేవలందిస్తామని వైద్యుడు బి.కృష్ణ తెలిపారు. అవసరమైన వారంతా అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని పీఎంపీలు ప్రజలకు చేరువగా ఉండి సీజనల్ వ్యాధుల



భీమడోలులో వైద్యుడిని సత్కరిస్తున్న పీఎంపీ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు బృందం

విషయంలో అప్రమత్తం చేయాలన్నారు. సేవాలక్ష్యంగా పని చేసి రోగులకు అండగా ఉండాలన్నారు. అనంతరం వైద్యులకు దుశ్శాలువాలను కప్పి జ్ఞాపికలను అందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్‌వీఆర్‌కే శివరామకృష్ణ, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వణుకూరి మురళీకృష్ణ, రాష్ట్ర కార్యదర్శులు రమేష్, కోటేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి రామకృష్ణంరాజు, మండల కార్యదర్శి జగదీష్ పాల్గొన్నారు.

పుస్తక పఠనం.. విద్యార్థులకు మేలు

పెదవేగి : నిత్యం పుస్తక పఠనం విద్యార్థులకు ఎంతో మేలు చూకూరుతుందని పెదవేగి గ్రంథపాలకుడు తోట అరుణ్‌కుమార్ అన్నారు. ప్రభుత్వం చదవడం–మాకిష్టం అనే కార్యక్రమం ద్వారా విద్యార్థుల భవిష్యత్తు ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు శ్రీకారం చుట్టిందని ఆయన చెప్పారు. పెదవేగి శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని గ్రంథపాలకుడు విద్యార్థులతో ఉత్సాహంగా నిర్వహించారు.

దసరా సెలవులను సద్వినియోగం చేసుకోవాలి

భీమడోలు: దసరా సెలవుల్లో బాలబాలికలు చదవడం మాకిష్టం కార్యక్రమాల్లో భాగస్వామ్యులై సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. మండలంలోని భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాలు ఉత్సాహ భరితవాతావరణలో నిర్వహించారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలకు చెందిన చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొని సామూహిక పుస్తక పఠనం చేసారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, పెద్దలు కడగల సత్యానారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

పెదపాడు: నడిచి వెళ్తున్న ఓ వ్యక్తిని మోటారు సైకిల్ ఢీ కొనడంతో తలకు తీవ్రగాయాలైన సంఘటన పెదపాడు మండలంలోని కొత్తూరులో చోటు చేసుకుంది. పెదపాడు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొత్తూరు గ్రామంలో తెల్లవారు జామున 4గంటలకు రోడ్డుపై వెళుతున్న ఆవుల వెంకట దుర్గారావును ఓ ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టాడు. దుర్గారావు తలకు బలమైన గాయాలవడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి వర్గాల సమాచారం మేరకు పెదపాడు ఎస్సై చల్లా కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పనవీడులో రోడ్డు ప్రమాదం

ద్విచక్ర వాహనంపై వెళుతున్న చిరువ్యాపారిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అతనికి తీవ్రగాయాలయ్యాయని బాధితుడి ఫిర్యాదు మేరకు పెదపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కృష్ణా జిల్లా ఆరుగొలను చెందిన పీకా చిట్టిబాబు ద్విచక్ర వాహనంపై జామ కాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తుంటాడు. చిట్టిబాబు ఆరుగొలను నుంచి జాతీయ రహదారిపై వస్తుండగా అప్పనవీడు వద్ద గుర్తుతెలియని వాహనం అతడిని ఢీకొంది. ఎస్సై చల్లా కృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చురుగ్గా ఉపాధి పనులు



కొల్లేరు గ్రామంలో చెరువు పూడిక తీస్తున్న కూలీలు



చాటపర్రులో పంట కాలువ పూడిక తీస్తున్న కూలీలు

ఏలూరు రూరల్: ఏలూరు మండలంలో ఉపాధి హామీ పథకం పనులు చురుగ్గా సాగుతున్నాయి. 2023–2024 సంవత్సరంలో అధికారులు రూ.37.90 కోట్లతో రూపొందించిన మండల ఉపాధి హామీ పథకం బడ్జెట్ కూలీలకు చేతినిండా పని కల్పించింది. ఇప్పటికే కూలీలు సుమారు రూ.11 కోట్లు వేతనాల రూపంలో అందుకున్నారు. 7 నెలలకు ఒక్కొక్క కూలీ 54 రోజులు పనిచేసి సుమారు రూ.13 వేల నుంచి రూ.14 వేలు అందుకున్నారు. 2023 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 2024 మార్చి వరకూ బడ్జెట్‌లో పనులు కొనసాగనున్న సంగతి తెలిసిందే.

ఉపాధితో పాటు అభివృద్ధి

ఈ ఏడాది చాటపర్రు, కోటేశ్వరదుర్గాపురం, మొండికోడు, గుడివాకలంక, కొక్కిరాయిలంక, ప్రత్తికోళ్ల లంక, పైడిచింతపాడు, కోమటిలంక, పెదయాగనమిల్లితో పాటు కలకుర్రు, శ్రీపర్రు, మాదేపల్లి, జాలిపూడి, కాట్లంపూడి, మల్కాపురం గ్రామాల్లో ఉపాధి పనులు సాగుతున్నాయి. ఎంఎన్ఆర్‌ఈజీఎస్ నిబంధనల మేరకు కూలీల పని ఆధారంగా కేంద్రం ప్రభుత్వం మెటీరియల్ పేమెంట్ అందించనున్న సంగతి తెలిసిందే. అంటే మొత్తం బడ్జెట్ రూ.37.90 కోట్లలో రూ 22.74 కోట్లు కూలీలకు వేతనాల రూపం(వేజ్ పేమెంట్)లో అందనున్నాయి. వేజ్ పేమెంట్ పూర్తి చేస్తే ప్రభుత్వం అదనంగా మరో రూ.15.16 కోట్లు మెటీరియల్ పేమెంట్ మంజూరు చేయనుంది.

చేతినిండా పని

గత ఏడాదితో పోలిస్తే 2023–2024 సంవత్సరంలో అధికారులు పని దినాలు పెంచారు. గత ఏడాది 6 లక్షల 43 వేల 466 పనిదినాలు కల్పించగా, ఈ ఏడాది మరో 2 లక్షల 44 వేల 434 పని దినాలు పెంచారు. మొత్తంగా 8 లక్షల 84 వేల 900 పని దినాలు కల్పించగా, ఇప్పటికే 3 లక్షల 25 వేల 123 పని దినాలు చేశారు. దీని నిమిత్తం రూ.11 కోట్లు అందుకున్నారు. ఒక్కొక్క కూలీ రూ.13 వేల నుంచి రూ.14 వేల వరకు వేతనాలు పొందారు. జాలిపూడి, మాదేపల్లిలో కూలీల పని కల్పన 100 శాతం ఉండగా, చాటపర్రు, గుడివాకలంక, పైడిచింతపాడు, శ్రీపర్రు, 85 శాతం నుంచి 70 శాతం వరకు ఉంది. గత ఏడాది ఒక్కొక్క కూలీ సుమారు 76 రోజులు పని చేశారు. ఇప్పుడు ఈ సంఖ్య 100కు చేరాలని అధికారులు భావిస్తున్నారు. రోజుకు రూ.257 వేతనం చొప్పున ఇప్పటికే 54 రోజులు పని కల్పించడం విశేషం. మొత్తంగా ఈ ఏడాదిలో 100 రోజులు పనిచేస్తే ఒక్కొక్క కూలీ రూ.25 వేల 700 సంపాదించవచ్చు. ఇందుకోసం గ్రామాల్లో పంటకాలువ, చెరువులు, పూడిక పనులు చేపట్టారు.

కూలీలకు చేతినిండా పని



మండలంలో ఉపాధి హామీ పథకం కింద 7,608 కుటుంబాలకు పని కల్పించాం. 2022–2023 ఏడాది కన్నా 2023–2024 బడ్జెట్‌లో రూ.10 కోట్లు అదనంగా పెంచాం. దీనివల్ల లేబర్ బడ్జెట్ రూ.22.75 కోట్లకు చేరింది. కూలీలకు చేతినిండా పని కల్పిస్తున్నాం. ఇప్పటికే కూలీలకు రూ.11 కోట్లు వేతనాలు అందడం సంతోషంగా ఉంది. రానున్న నెలల్లో మరిన్ని రోజులు పని కల్పించి టార్గెట్ పూర్తి చేస్తాం. – కిషోర్, ఏపీఓ

వేజ్ పేమెంట్ ఆధారంగా నిధులు



కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీల వేజ్ పేమెంట్ ఆధారంగా మెటీరియల్ పేమెంట్ అందస్తుంది. దీనిని గుర్తించి వేజ్ పేమెంట్ మరింత పెంచాం. తద్వారా కూలీలకు పని దొరకడంతో పాటు మెటీరియల్ పేమెంట్ సైతం పెరుగుతుంది. ఈ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ తదితర మౌలిక వసతులు ఏర్పాటు చేసేకోవచ్చు. ఒక విధంగా కూలీల కష్టంతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతోందని సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు గుర్తించి కూలీలకు పెద్ద ఎత్తున పని కల్పించాలి. – పెన్మత్స శ్రీనివాసరాజు, ఎంపీపీ

అలరించిన గాత్ర సంగీత కచేరి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన ప్రముఖ కళా సంస్థలు ఫైన్ ఆర్ట్స్ అకాడమీ, హిందూ యువజన సంఘం సంయుక్త ఆధ్వర్యాన ఆదివారం సాయంత్రం స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో గుడిపాటి గోపాల కృష్ణమూర్తి జ్ఞాపకార్థం గుడిపాటి లలితాశర్మ సహకారంతో కళారత్న డీవీ మోహనకృష్ణ నిర్వహించిన గాత్ర సంగీత కచేరి ప్రేక్షకులను విశేషంగా అలరించింది. మోహనకృష్ణకు వయొలిన్‌తో పెరవలి నందకుమార్, మృదంగంతో పెరవలి జయ భాస్కర్ వాద్య సహకారం అందించారు. తొలుత వక్తలు మాట్లాడుతూ కర్ణాటక సంగీతాన్ని నూతన మార్గంలో పరవళ్లు తొక్కించిన పద్మభూషణ్ మంగళంపల్లి బాల మురళీకృష్ణ ప్రియ శిష్యుడైన మోహనకృష్ణ ఆయన బాణీలను ముందుకు తీసుకు వెళుతూ గాత్ర సంగీత రంగానికి విశేష సేవలు అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఉభయ సంస్థల అధ్యక్షులు పరిమి సావిత్రి, యర్రా సోమలింగేశ్వరరావుల అధ్యక్షతన జరిగిన



కచేరి చేస్తున్న డీవీ మోహనకృష్ణ

సభలో కళాకారులను ఘనంగా సత్కరించారు. ఫైన్ ఆర్ట్స్ అకాడమీ కార్యదర్శి నాట్యాచార్య డి.హేమసుందర్ కళాకారులను సభకు పరిచయం చేశారు. కార్యక్రమంలో ఉభయ సంస్థల ప్రతినిధులు వేమా కోటేశ్వరరావు, డీఏ కృష్ణకుమార్, ఎల్.వెంకటేశ్వరరావు, పీవీఆర్ కృష్ణ శాస్త్రి, జయలక్ష్మి రామచంద్రన్, పార్వతి రామచంద్రన్, వీవీ హనుమంతరావు, ఆర్ఎస్ఆర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్‌ను కలిసిన సందీప్

ఏలూరు (టూటౌన్): వైఎస్సార్ సీపీ రాష్ట్ర సోషల్ మీడియా కో–ఆర్డినేటర్ సజ్జల భార్గవ్‌రెడ్డి ఆదివారం ఏలూరు విచ్చేసిన సందర్భంగా ఆయనను లిడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఏఎస్ఆర్ స్టేడియం సమీపంలోని గోకుల్ కళ్యాణ మండపంలో భార్గవ్‌రెడ్డికి స్వాగతం పలికారు. స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల నానికి, సోషల్ మీడియా కో–ఆర్డినేటర్ భార్గవ్‌రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. లిడ్ క్యాప్ డైరెక్టర్‌గా నియమించినందుకు సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు.

ఆరోగ్యంపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చునని హైదరాబాద్ ఏషియన్ వాస్క్యులర్ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ సోమాచారి తెలిపారు. ఏలూరు రామచంద్రరావు పేటలోని గో సంరక్షణ సమితి ప్రాంగణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఏలూరు గో సంరక్షణ ఆధ్వర్యాన ఆదివారం ఉచిత రక్తనాళాల వైద్య పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరాన్ని గో సంరక్షణ సమితి అధ్యక్షుడు గుర్రం సత్యనారాయణ ప్రారంభించారు. దాదాపు 200 మందికి వైద్య పరీక్షలు చేశారు. ముఖ్యంగా రూ.4,500 విలువైన కలర్ డాప్లర్ ఆల్ట్రాసౌండ్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. డాక్టర్ సోమాచారి, ఆయన వైద్య బృందం ఈ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి తగు సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ సోమాచారి మాట్లాడుతూ ఎవరికైనా రక్తనాళాలకు సంబంధించి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సోమాచారి

ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే తగిన వైద్యం తీసుకుంటే మంచి ఫలితం ఉంటుందన్నారు. అక్కినేని వెంకటేశ్వరరావు, లయన్స్ క్లబ్ ఆఫ్ ఏలూరు గో సంరక్షణ అధ్యక్షుడు నల్లా కాశి, గో సంరక్షణ సమితి కార్యదర్శి మునగాల మురళీకృష్ణ, ఏలూరు కేబుల్ ఆపరేటర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సంబంగి జగదీష్ పాల్గొన్నారు.

గంగానమ్మ జాతర ఉత్సవాల్లో నగర మేయర్



అమ్మవారి స్నాన అభిషేకానికి తొలి బిందె నీళ్లు తీసుకెళ్తున్న నగర మేయర్ నూర్జహాన్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక మార్కెట్ యార్డ్ సమీపంలోని వీవీ నగర్‌లో వేంచేసియున్న శ్రీ గంగానమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల్లో నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన ఈ జాతర మహోత్సవంలో మేయర్ అమ్మవారికి తొలిబిందె నీళ్లస్నాన అభిషేకం చేశారు. తొలుత స్థానికులు మేయర్ నూర్జహాన్‌కు స్వాగతం పలికి అమ్మవారి ఆలయంలోకి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా అమ్మవారికి మేయర్ పసుపు, కుంకుమలు, చీర సమర్పించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానికులు అమ్మవారికి 101 బిందెలతో స్నానం ఆచరింపజేశారు. అనంతరం అమ్మవారికి చద్ది నైవేద్యాలు, వేడి నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమాలను ఆలయ కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.